జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 21, అక్టోబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



## టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు



**అమరావతి, మహానాడు:**
తెలుగుదేశం పార్టీ(టీడీపీ) తమ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఖరారు చేసింది. కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రులఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరంను ఈ మేరకు ఆ పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది.



## పదండి 'మందు'కు
# కిక్కు అదిరింది బాసూ!

- ఏపీలో కొత్త లిక్కర్‌కు గల్లాపెట్టెల గలగల
- ఖజానాకు పెరుగుతున్న లిక్కర్ కిక్కు
- యమాస్పీడుగా అమ్ముడుపోతున్న కొత్త బ్రాండ్లు
- పెరిగిన 'బీర్'బలులతో కేసులకు కేసుల అమ్మకాలు
- మద్యం దొరకడమే దానికి కారణం
- బ్రాండ్ల రాకతో బార్లకు తగ్గిన ఆదాయం
- ఒకేచోట వైన్ షాపులు పెట్టడంతో తగ్గిన పోటీ
- గతంలో మాదిరి ఏరియా పాయింట్లు లేకపోవడమే సమస్య
- గతంలో పాయింట్ల ప్రకటనతో కనిపించని సమస్య
- ఇప్పుడు ఉన్నచోటనే ఆదాయం పంచుకోవాల్సిన దుస్థితి
- ఎమ్మెల్యేలకు 30 లక్షల మామూళ్లు
- మరికొన్ని చోట్ల పెట్టుబడి లేకుండానే వాటాలు డిమాండ్ చేస్తున్న వైనం
- చాలాచోట్ల పార్టీ నేతల షాపుల నుంచే మామూళ్లు డిమాండ్ చేస్తున్న వైచిత్రి
- ఫలితంగా సిండికేట్లకు అన్నిచోట్లా అవకాశం
- గ్రామాల్లో బెల్లుషాపులకు పోటీ
- రహదారులపై మందుబాబుల హడావిడితో జనాలకు ఇబ్బంది

**(మార్తి సుబ్రహ్మణ్యం)**

ఐదేళ్ల పాటు జగన్ బ్రాండ్లతో మొహంమొత్తిన మందుబాబులు ఇప్పుడు బ్రాండ్ల రాకతో యమా ఖుషీతో కనిపిస్తున్నారు. ఫలితంగా వైన్‌షాపుల గల్లాపెట్టె గలగలలాడుతుండగా.. ఖజానాకు సైతం లిక్కర్ కిక్కు పెరుగుతోంది. కొత్తఐన్‌షాపుల్లో బ్రాండ్ల రాకతో.. ఇప్పటిదాకా బార్లపై ఆధారపడిన మందుబాబులు, ఇప్పుడు బార్ల మొహం చూడటం మానే స్తున్నారు. అంతా బాగానే ఉన్నా.. గతంలో మాదిరి వైన్ షాపు పాయింట్లు ఇవ్వకుండా, ఊరి పేర్లు ఇవ్వడం సామాన్య జనాలకు ఇబ్బందికరంగా పరిణమించింది.


ఏపీలో బ్రాండెడ్ లిక్కరు పొంగి ప్రవహి స్తోంది. ఈనెల 16 నుంచి కొత్త వైన్‌షాపులు ప్రారంభమైన నేపథ్యంలో, బ్రాండెడ్ లిక్కరు కోసం ముఖంవాచిన మందుబాబులు వాటి కోసం ఎగబడుతున్నారు. ఫలితంగా ఈ మూడురోజుల్లోనే 541 కోట్ల అమ్మకాలు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

కేవలం ఈ మూడురోజుల వ్యవధిలోనే వైన్‌షాపు యజమానులు మూడుసార్లు స్టాక్ తీసుకున్నారంటే, ఐదేళ్ల జగన్ బ్రాండ్లపై మందుబాబు ఏ స్థాయిలో విసిగిపోయారో అర్థమవుతుంది. ఆ ప్రకారంగా 7948 మంది వైన్‌షాపు యజమానులు, లిక్కర్ స్టాకు తీసు కువెళ్లినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

వారి లెక్కల ప్రకారం.. ఇప్పటిదాకా రాష్ట్రంలో 1,94,261 కేసుల బీర్లు అమ్ముడు పోయాయట. ప్రధానంగా జగన్ ఐదేళ్ల పాలనలో దిక్కులేక బూమ్ బూమ్ వంటి దిక్కుమాలిన బీర్లు తాగిన 'బీర్'బలులు.. ఇప్పుడు కింగ్‌ఫిషర్, నాకౌట్, రాయల్ చాలెంజ్, బడ్వైజర్, కరోనా వంటి నిఖార్సైన బీర్లు తాగి చిల్లవుతున్నారు.

ఇక 100 పైపర్స్, టీచర్స్, ఓటీ, మాన్షన్‌హౌస్, మెక్‌డొవెల్స్, రాయల్‌స్టాగ్, ఇంపీరియల్ బ్లూ, బ్లెండర్స్ స్ప్రైడ్, 8 పీఎం, రాయల్ చాలెంజ్ వంటి విస్కీ, బ్రాందీ 6,77,511 కేసుల లిక్కర్ అమ్ముడుపోయాయి. ఫలితంగా ఈనెల 16 నుంచి ఎక్సైజ్ శాఖ 77 కోట్ల రూపాయల అమ్మకాలు జరిపిందట.

ఇదంతా బాగానే ఉన్నా.. లిక్కర్‌షాపుల సంఖ్య పెరగడం, గతంలో మాదిరి ఒక పట్టణం, మండలం లోని ఫలానా ఏరియా అని పేర్కొనకుండా.. కేవలం పట్టణాలు పేర్లు-సంఖ్య ఇవ్వడం అటు కోట్లు ఖర్చు పెట్టి వైన్‌షాపులు పెట్టిన వ్యాపారులకు, ఇటు సాధారణ ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఉదాహరణకు గతంలో విజయవాడకు 50 వైన్‌షాపులు కేటాయించారను కోండి. అందులో విజయవాడలోని ఏయే ప్రాంతాల్లో వైన్‌షాపులు పెట్టుకోవచ్చో స్పష్టం చేసేవారు. దానితో ఆ ప్రాంతాల్లోనే వైన్‌షాపులు పెట్టుకునేవారు. అప్పుడు పోటీ లేకుండా వ్యాపారం బాగా నడిచేది. అది స్థానిక ప్రజలకూ ఇబ్బందిగా ఉండేది కాదు.



ఇప్పుడు అందుకు భిన్నంగా విజయవాడకు 70 షాపులు కేటాయించి, ఏయే ప్రాంతాల్లో షాపులు పెట్టుకోవచ్చో పేర్కొన కుండా, మీ ఇష్టం వచ్చినచోట పెట్టుకోమన్న కొత్త విధానం, వ్యాపారులు-ప్రజలకు ఇబ్బంది కరంగా మారింది. దానితో డిమాండ్ ఉన్నచోటఉఏ నాలుగైదు షాపులు పెట్టు కున్న పరిస్థితి కనిపిస్తోంది. దాహరణకు విజయ వాడలో బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు, బెంజి సర్కిల్, గుణదల, ఓల్డ్‌సిటీ బాగా రద్దీగా ఉండే ప్రాంతాలనుకోండి. దానితో వ్యాపారులు ఒకేచోట, అంటే ఒకటి నుంచి 3 కిలోమీటర్ల మధ్యలోనే ఐదారు షాపులు పెట్టుకుంటున్న పరిస్థితి. ఇక కాలనీలు, మురికివాడలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. దీనితో ఉన్న వ్యాపారాన్నే అందరూ పోటీపడి పంచుకోవటం అనివార్యమవుతోంది. దీనితో సిండి కేట్లకు అవకాశం ఏర్పడుతోంది.


ఫలితంగా ఆయా ప్రాంతాల స్థానికులకు, మందుబాబుల హడావిడితో ఇబ్బంది ఏర్పడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది ప్రజల్లో ప్రభుత్వంపై విమర్శలకు దారితీస్తోందంటున్నారు. ఇక మున్సిపాలిటీ ల్లోనూ ఇలాంటి వాతావరణమే కనిపిస్తోంది. ఎక్కువ డబ్బు పెట్టి షాపులు దక్కించుకోవడం, స్థానిక ఎమ్మెల్యేలకు వాటాలు ఇవ్వాల్సి రావడంతో వైన్‌షాపులు దక్కించుకున్న వారు ఇప్పుడు గ్రామాల్లో బెల్ట్‌షాపుల వైపు దృష్టి పెడుతున్నారు. ఫలితంగా తమ నష్టాన్ని భర్తీ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నమాట.

చాలాచోట్ల ఎమ్మెల్యేలకు షాపుకు 30 లక్షలు ఇవ్వాల్సివస్తోంది. అది కాక మళ్లీ నెలవారీ ముడుపులు 'మామూలే'నట. మరికొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు వాటాలు డిమాండ్ చేస్తున్నారు. ఇంకొన్ని నియోజక వర్గాల్లో అయితే ఎమ్మెల్యేలు 60-40 నిష్పత్తిలో వాటాలు డిమాండ్ చేస్తున్న పరిస్థితి. దీనితో వాటాలు వేసుకుని వైన్‌షాపులు దక్కించుకున్న వ్యాపారులు, వేరే మార్గం లేక సిండికేట్లుగా ఏర్పడటం, బెల్టుషాపులకు తెరలేపడం అనివార్యమవుతోందంటున్నారు.

నర్సరావుపేట నియోజకవర్గంలో వైన్‌షాపుల కమిషన్ల పంచాయతీ రోడ్డునపడి పార్టీ-ప్రభుత్వ పరువు పోయేందుకు కారణమవుతోంది. మిగతా.. 2లో

## ఇంటర్ విద్యార్థిని మృతిపై
# సీఎం చంద్రబాబు తీవ్ర విచారం

- బద్వేల్ ఘటనలో నిందితుడిని వెంటనే శిక్షించేందుకు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ
- నేరస్తుడికి మరణ శిక్ష స్థాయి శిక్ష పడేలా చూడాలని అధికారులకు ఆదేశం
- మహిళలపై అఘాయిత్యాలు చేసేవారికి ఈ శిక్ష ఒక హెచ్చరికగా ఉండాలన్న సీఎం



**అమరావతి, మహానాడు:**
కడప జిల్లా బద్వేల్ లో యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇంటర్ విద్యార్థిని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థిని ఒక దుర్మార్గుడి దుశ్చర్యకు బలికావడంపై ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై శనివారం నుంచి పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి... ఎప్పటికప్పుడు ఆమెకు అందుతున్న చికిత్స గురించి, కేసు విచారణ గురించి తెలుసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశామని జిల్లా ఎస్పీ సీఎంకు వివరించారు. వేగంగా విచారణ పూర్తి చేసి, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని సీఎం ఆదేశించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడం అంటే.. హంతకుడిని త్వరగా, చట్ట బద్ధంగా శిక్షించడమే అని మిగతా.. 2లో



## ఆంధ్రాను ఆదుకుంటాం

- మంత్రి లోకేష్‌కు అమిత్ షా భరోసా

**ఢిల్లీ,మహానాడు:**
కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ఆదివారం భేటీ అయ్యారు. 40 నిమిషాల పాటు అనేక అంశాల పై ఇరువురి మధ్య చర్చ జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో చేపట్టిన అనేక కార్యక్రమాలను అమిత్ షాకు లోకేష్ వివరించారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్నందుకు అమిత్ షా కు ఈ సందర్భంగా మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. సమస్యలను అధిగమించి రాష్ట్రం బలమైన శక్తిగా ఎదిగేందుకు కేంద్ర సహాయం ఉంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా భరోసా ఇచ్చారు.

## గుర్ల ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష

- డయేరియా మరణాలపై సీనియర్ ఐఎఎస్ అధికారితో విచారణ



**అమరావతి, మహానాడు:**
విజయనగరం జిల్లా, చీపురుపల్లి నియోజకవర్గం గుర్లలో అతిసారంతో ఎనిమిది మంది చనిపోయిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం మరోసారి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న పరిస్థితిని, బాధిత ప్రజలకు అందుతున్న వైద్య సాయాన్ని అధికారుల ద్వారా తెలుసుకున్నారు. డయేరియా వల్లనే మరణాలు అనే అంశంపై వైద్య శాఖ అధికారులతో మాట్లాడారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, మంచినీరు అందజేస్తు న్నామని జిల్లా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అయితే అసలు ఘటనకు కారణాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. దీనిలో భాగంగా సీనియర్ ఐఎఎస్ అధికారి కె. విజయానంద్‌తో మొత్తం ఘటనపై విచారణ జరిపించాలని నిర్ణయించారు.

మరణాలకు అసలు కారణం ఏంటి, ఆయా ప్రభుత్వ శాఖల పరంగా ఉన్న సమస్యలు ఏంటి అనేది తెలుసుకునేందుకు సమగ్ర విచారణ జరపాలని సీఎం భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో నీటిని ఎప్పటికప్పుడు పరీక్షలకు పంపాలని.... సమస్య పరిష్కారం అయ్యేవరకు మంచినీరు సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. వైద్య శిబిరాలు కొనసాగించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, ఆర్ డబ్లుఎస్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రజలకు ధైర్యం చెప్పి. సమస్య పరిష్కారం అయ్యేవరకు వారికి అండగా ఉండాలని సీఎం అధికారులను సూచించారు.



# బ్లాక్‌లో వీఐపీ దర్శన టికెట్లు!

- వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానం కక్కుర్తి

**తిరుమల,మహానాడు:**
తిరుమల తిరుపతి దేవస్థానం వీఐపీ దర్శన టికెట్లను వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానం బ్లాక్‌లో అమ్ముకున్నారు. ఎమ్మెల్సీ సిఫార్సు లేఖపై భక్తులు ఆరు టికెట్లు పొందారు. ఈ ఆరు టికెట్లను రూ.65 వేలకు వైసీపీ ఎమ్మెల్సీ విక్రయించారు. ఈ సంఘటనపై టీటీడీ అధికారులకు ఓ భక్తుడి ఫిర్యాదు చేశారు. విచారణలో వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానం బ్లాక్‌లో టికెట్లు అమ్ముకున్నారన్న విషయం నిర్ధారణ కావడంతో పోలీసులకు టీటీడీ విజిలెన్స్ వింగ్ కు ఫిర్యాదు చేశారు. ఏ1గా చంద్రశేఖర్, ఏ2గా ఎమ్మెల్సీ జకియా ఖానం, ఏ3గా ఎమ్మెల్సీ పీఆర్వో కృష్ణతేజ పేర్లను పోలీసులు కేసులో నమోదు చేశారు.

## త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేం

- సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మహానాడు:**
జీవితంలో రిస్క్ లేకుండా గొప్ప విజయాలు సాధించ లేమని.. త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంచి లీడర్ కావాలంటే ధైర్యం, త్యాగం ఉండాలని చెప్పారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో నిర్వహించిన లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. "మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, మన్మోహన్ సింగ్, పీవీ నరసింహారావు సహా ఎంతోమంది నాయకులు మనందరికీ ఆదర్శం. నాయకత్వ లక్షణాలను వారి నుంచే నేర్చుకున్నాను. నాయకులు డబ్బు, సమయం, వ్యక్తిగత



జీవితం.. ఇలా అన్నీ త్యాగం చేయాలి. మంచి లీడర్ కావాలంటే ధైర్యం, త్యాగం ఉండాలి. సిగ్గుపడకుండా ప్రజలతో మమేకమవ్వాలి. మిగతా.. 2లో

# త్వరలో ఉచిత గ్యాస్ సిలెండర్లు!

- సూపర్ సిక్స్ హామీ అమలుకు శ్రీకారం
- దీపావళి నుంచి అర్హులకు ఉచితంగా వంట గ్యాస్
- ఏడాదికి రూ.3000 కోట్ల ఖర్చు
- ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం
- రాష్ట్ర పౌరసారఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



**అమరావతి,మహానాడు:**
ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం త్వరలోనే అమల్లోకి తీసుకు వస్తున్నామని, రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించబోతోందని, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఆదివారం తెనాలి నియోజకవర్గం పరిధిలో కాజీపేట, కొలకలూరు, ఎరుకలపూడి, కటెవరం, అంగలకుదురుల్లో సుమారు రూ.కోటి 65 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, మిగతా.. 2లో



04

### పల్లెలే దేశానికి పట్టు కొమ్మలు!



02

### 2027 ఫిబ్రవరి నెలలో జమిలి ఎన్నికలు




04

### గ్రూప్-1 పరీక్షపై బీజేపీ, బీఆర్ఎస్‌లు కుమ్మక్కు!

## రైతులకు రుణమాఫీ కాలేదు...

- అంతా 'అనుముల ఇంటెలిజెన్స్' మహిమ!
- కాంగ్రెస్ పార్టీ ట్వీట్‌పై మండిపడ్డ కేటీఆర్

**హైదరాబాద్, మహానాడు:**
తెలంగాణలో 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్టు జాతీయ కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్ లో చేసిన పోస్ట్ పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రుణమాఫీ చేసినట్టు ఇచ్చిన ప్రకటనలో ఏ విధంగా అయితే అర్టిఫిషియల్



ఇంటలిజెన్స్ (AI) రూపొందించిన చిత్రాన్ని వాడారో.. రుణమాఫీ జరిగిన రైతుల లెక్క విషయంలో కూడా మీ ముఖ్యమంత్రి ఏఐ టెక్నిక్ వాడారంటూ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ పేర్కొన్న 40 లక్షల మంది రైతులు అనే సంఖ్య అనుముల ఇంటెలిజెన్స్ అంటే రేవంత్ రెడ్డి వాడిన అబద్దాల ఏఐ టెక్నిక్ తో రూపొందించిందేనని ఎద్దేవా చేశారు.

నిజానికి తెలంగాణలో ఇప్పటి వరకు రైతు రుణాలు 40 శాతం కూడా మాఫీ కాలేదని చెప్పారు. కానీ తరుచూ నిబంధనలు మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ సోమవారం 21, అక్టోబర్ 2024 ‖



## సీఎం రేవంత్‌కు 317 జీవోపై తుది నివేదిక అందజేత



హైదరాబాద్, మహానాడు:
317 జీవో పై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అధ్యక్షతన సభ్యులు, మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పాటు నిష్ణాతులైన మేధావులతో సుదీర్ఘంగా చర్చించారు.

ఉద్యోగుల, ఉపాధ్యాయుల అభిప్రాయాలను క్యాబినెట్ సబ్ కమిటీ వినతుల రూపంలో ప్రత్యక్షంగా, వెబ్సైట్ ద్వారా అప్లికేషన్స్ ను స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించి తుది నివేదిక పత్రాలను సీల్డ్ కవర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అందజేశారు.

## నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తాం

- హోంమంత్రి అనిత



కడప, మహానాడు:
కడప జిల్లా బద్వేలులో ప్రేమోన్మాది పెట్రోల్ దాడి ఘటనలో ఇంటర్ విద్యార్థిని మృతి చెందడం విషాదకరమని ఏపీ హోంమంత్రి అనిత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో నిందితుడు విఘ్నేష్‌ను పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు.

నిందితుడు, అతడికి సహకరించిన వారికి కఠిన శిక్ష పడేలా చేస్తామన్నారు. బాధితురాలి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని అనిత హామీ ఇచ్చారు.

## ఏపీలో కొత్తగా నాలుగు లేన్ల హైవే..

- కేంద్రం గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ,మహానాడు:
ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. కేంద్రం నుంచి రాష్ట్రానికి సహకారం మెండుగా ఉంది. నిధుల కేటాయింపు దగ్గర నుంచి కొత్త ప్రాజెక్టుల వరకూ అన్నింటిలోనూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం



దక్కుతోంది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి మరో శుభవార్త అందింది.

విశాఖపట్నం- అరకు మార్గంలో నాలుగు లైన్ల రహదారికి కేంద్రం పచ్చజెండా ఊపింది. విశాఖ- అరకు రూట్లో పెందుర్తి - బౌడరా మధ్య ఎన్‌హెచ్-516బి విస్తరణకు కేంద్రం ఆమోదం తెలిపింది. పెందుర్తి నుంచి కొత్తవలస, శృంగవరపుకోట మీదుగా బౌడరా వరకూ ఈ రోడ్డు ఉంది. అయితే ఈ రోడ్డును నాలుగు లైన్లకు విస్తరించాలని గతంలోనే ప్రతిపాదనలు వెళ్లాయి. భారతమాల పరియోజన కింద అనుమతులు కూడా మంజూరయ్యాయి. అయితే టెండరు ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. రహదారుల విషయంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

## 2027 ఫిబ్రవరి నెలలో జమిలి ఎన్నికలు

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



న్యూఢిల్లీ,మహానాడు:
భారతదేశం మొత్తం ఒకేసారి 2027 ఫిబ్రవరిలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఎన్నికలు (జమిలీ) నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం అవుతోంది. జమిలీ ఎన్ని కలకు మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ కూడా పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. జమిలి ఎన్నికలు జరగాలి అంటే రాజ్యాంగంలో 5 ఆర్టికల్స్ (ఆర్టికల్ 83,85,172, 174,356) లు రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా చేయాలని సూచించింది. ఈ బిల్లు అమోదం పొందాలి అంటే లోక్ సభ, రాజ్యసభలో 67% మంది మద్దతు తెలిపాలి. 14 రాష్ట్రాలు అసెంబ్లీ లు మద్దతు ఇవ్వాలి. అలా మద్దతు ఇస్తే బిల్లు రాజ్యాంగ పరిధిలోకి వస్తుంది.

ఈ బిల్లు 2024 ఈ శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. పార్లమెంట్‌లో మద్దతు లభిస్తే 2027 ఫిబ్రవరిలో ఉత్తర ప్రదేశ్ ఎన్నికలతో పాటు దేశం మొత్తం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహిస్తుంది. ఈ ఎన్నికలు జరిగిన 100 రోజుల తర్వాత మున్సిపల్, గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుంది. దేశం మొత్తం పరిపాలన సౌలభ్యం కొరకు ఈ జమిలి ఎన్నికలు జరపనున్నట్టు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.

## త్వరలో హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ సేవలు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, మహానాడు: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక సదుపాయాలతో తీర్చి దిద్దుతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ పనులను 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఆధునిక సౌకర్యాలతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు అంకితం చేస్తారని కేంద్రమంత్రి తెలిపారు.




రూ.430 కోట్లతో కొనసాగుతున్న చర్లపల్లి టెర్మినల్ నిర్మాణ పనులను కిషన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

అమృత్ పథకంలో భాగంగా స్థానికంగా ఉన్న అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రూ.430 కోట్లతో చర్లపల్లి, రూ.715 కోట్లతో సికింద్రాబాద్, రూ.429 కోట్లతో నాంపల్లి రైల్వేస్టేషన్‌లలో పనులు ప్రారంభించినట్టు తెలిపారు.

రూ.521 కోట్లతో కాజీపేటలో రైల్ మానిఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించినట్టు చెప్పారు. దానికి సంబం ధించిన నిర్మాణ పనులు త్వరలో చేపడతామన్నారు.

## ‘ఉపాధి’ పథకంలో అంకుడు, తెల్ల పొణికి చెట్ల పెంపునకు ఏర్పాట్లు

- ఏటికొప్పాక, కొండపల్లి కళాకారులకు శుభవార్త చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



అమరావతి, మహానాడు:
ఆంధ్ర ప్రదేశ్ హస్త కళల విశిష్టతను తెలిపే ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు రూపొందించే కళాకారులకు ఉప ముఖమంత్రి పవన్ కల్యాణ్ శుభవార్తను అందించారు. ఏటికొప్పాక బొమ్మల తయారీకి ముడి సరుకు అంకుడు కర్ర, కొండపల్లి బొమ్మలకు అవసరమయ్యే తెల్ల పొణికి చెట్లను విస్తారంగా పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల తయారీదారులకు వారికి అవసరమయ్యే కర్ర లభ్యత కష్టంగా మారింది. ఆ చెట్ల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ఈ సమస్యను పవన్ కల్యాణ్ దృష్టికి ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల కళాకారులు తీసుకువచ్చారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆ కళాకారులకు అందుబాటులో ఉండేలా అంకుడు, తెల్ల పొణికి చెట్లు పెంచడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా అంకుడు, తెల్ల పొణికి చెట్లు పెంచాలన్నారు. అటవీ ప్రాంతాల్లోనూ... ఏటికొప్పాక, కొండపల్లి పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ, అటవీ, సామాజిక స్థలాల్లో వీటి పెంపకంపై దృష్టి సారించాలన్నారు.

ఉప ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా అంకుడు, తెల్ల పొణికి చెట్లు పెంపకానికి రంగం సిద్ధమైంది. భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకొని కనీసం రెండు మూడు తరాలకు సరిపడా చెట్లను పెంచేలా పి.ఆర్. అండ్ ఆర్.డి. సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు పి.ఆర్. అండ్ ఆర్.డి. కమిషనర్ కృష్ణ తేజ ఆదేశాలు విడుదల చేశారు.

ఆంధ్రప్రదేశ్ హస్త కళలను ప్రోత్సహించే దిశగా ఉప ముఖ్యమంత్రి పలు చర్యలు తీసుకొంటున్నారు. రాష్ట్ర అతిథులను గౌరవపూర్వకంగా సత్కరించే సందర్భంలో అందించే బహుమతులగా ఆంధ్ర ప్రదేశ్ కళాకారులు తీర్చిదిద్దిన కళాకృతులను ఎంపిక చేసి వాటినే ఇస్తున్నారు. పవన్ కల్యాణ్ ప్రతిపక్ష నాయకుడిగా పర్యటనలు చేసిన సందర్భంలో ఏటికొప్పాక, కొండపల్లి కళాకారులు కలిసి తమ సమస్యలు తెలుపుకొంటూ అంకుడు కర్ర, తెల్ల పొణికి కర్ర లభ్యత తగ్గిపోయిందని... ఆ ముడి సరుకు లేకపోతే బొమ్మలు చేయలేమని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి హోదాలో ఏటికొప్పాక, కొండపల్లి హస్త కళాకారుల సమస్య తీర్చే దిశగా అడుగులు వేశారు. భవిష్యత్తులో కూడా వారు ముడి సరుకు కోసం ఇబ్బందులు ఎదుర్కొనకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నారు.

## త్వరలో ఉచిత గ్యాస్ సిలెండర్లు!

మొదటి పేజీ తరువాయి..

శంకుస్థాపనలు చేశారు.

అనంతరం మీడియా ప్రతినిధులతో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ హామీల్లో ముందడుగు వేస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ నాయకత్వంలో ఇచ్చిన హామీ లబ్ధిదారుల ఇళ్ళలో వెలుగును నింపుతుందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సూపర్ సిక్స్ లో ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలెండర్లను అందజేయడానికి శ్రీకారం చుడుతున్నాం. 23వ తేదీన జరిగే క్యాబినెట్ సమావేశంలో దీనిపై చర్చిస్తాం.

సూపర్ సిక్స్ కార్యాచరణలో ప్రధాన్యతగా పౌరసరఫరాల శాఖ నుంచి పథకం ప్రారంభం అవుతోంది. అర్హత వున్న ప్రతి ఇంటికి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలన్న నిర్ణయం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుంది. దీపావళి నుంచి ప్రారంభం అయ్యే ఈ పథకం ప్రతి కుటుంబంలోనూ వెలుగు నింపుతుంది. ప్రతి మహిళ గుర్తుపెట్టుకునే విధంగా అమలవుతుంది. ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీకి సుమారు రూ. 3000 కోట్ల వరకు వ్యయం అవుతుంది. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు కూటమి ప్రభుత్వ పాలనదక్షతకు, చిత్తశుద్ధికి నిదర్శనం.

### ప్రజలను గౌరవిస్తూ వారి నమ్మకాన్ని నిలబెడుతున్నాం

ఈ పథకం అమలుకు సంబంధించి పూర్తి వివరాలు ఒకటిరెండు రోజుల్లో వెల్లడిస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో సుమారు కోటి 45 లక్షలకు పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. కేంద్రం అమలు చేస్తున్న ఉజ్వల, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన దీపం పథకం కలుపుకొని ఈ పథకాన్ని అమలు చేస్తాం.

అర్హత వున్న ప్రతి ఒక్కరికి ఉచిత గ్యాస్ పథకం అమలుచేయాలన్నది మా సంకల్పం. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకొన్నాం. ఎంత ఖర్చయినా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఈ పథకంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హెచ్ పి, భారత్ గ్యాస్ కంపెనీలు భాగస్వామ్యం అయ్యాయి. కూటమి ప్రభుత్వం ద్వారా మంచి చేస్తారనే ఉద్దేశంతో ఓట్లు వేశారు. వారి నమ్మకాన్ని నిలబెడుతున్నాం. ప్రజలను గౌరవిస్తున్నాం. వారి ఓటుకు విలువ ఇచ్చాం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా ధాన్యం కొని రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు కూడా ఇవ్వలేదు. ఆ ప్రభుత్వం ఇవ్వకుండా ఆపేసిన రూ. 1674 కోట్లను కూటమి ప్రభుత్వం వచ్చాక చెల్లించాం. ఆది రైతులకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం” అని తెలిపారు.

## కిక్కు అదిరింది బాసూ!

మొదటి పేజీ తరువాయి..

ఇక్కడ పార్టీలోని వర్గాల మధ్యనే కొట్లాట జరుగుతుండటం విశేషం. చివరకు ఆ వ్యాపారాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని, పార్టీ నాయకులే ప్రెస్‌మీట్ మరీ చెప్పుకోవలసిన పరిస్థితి.



కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ నేతలు దక్కించుకున్న వైన్ షాపుల నుంచి కూడా, ఎమ్మెల్యేలు మామూళ్లు డిమాండ్ చేస్తుండటాన్ని పార్టీ నేతలు సహించలేకపోతున్నారు. సహజంగా ఎమ్మెల్యేలకు ప్రతి నియోజకవర్గంలో నమ్మకమైన నాయకుడు ఒకరుంటారు. నియోజకవర్గంలోని బార్లు-వైన్‌షాపుల వసూళ్ల వ్యవహారం ఆ నాయకుడే పర్యవేక్షిస్తుంటారు. ఇప్పుడు కొత్త వైన్‌షాపుల నుంచి కమిషన్లు, వాటాల వ్యవహారాలు కూడా వారే పర్యవేక్షిస్తున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు.

ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్లు ఆర్థికంగా నష్టపోయిన తమ దగ్గర కూడా.. ఎమ్మెల్యేలు కమిషన్లు, మామూళ్లు, వాటాలు అడగటం ఏమిటని తిరగబడుతున్న పరిస్థితి. మరికొందరు నాయకులయితే, తాము లోకేష్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించేవరకూ వెళుతున్నారు.

కొత్త ఎక్సైజ్ పాలసీ రూపకల్పనలో అధికారులు విఫలమవడంతో పాటు, ప్రభుత్వాన్ని కూడా తప్పు దోవపట్టించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మంత్రి కొల్లు రవీంద్ర ఈ వ్యవహారంలో అంత సీరియస్‌గా వ్యవహరించలేదన్న విమర్శలు పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

ఎక్సైజ్ పాలసీ అధ్యయనం కోసం వివిధ రాష్ట్రాలకు వెళ్లామంటున్న అధికారులు.. ఇలాంటి పాలసీ ఏ రాష్ట్రంలో అమలవుతుందో, ఇప్పటిదాకా చెప్పకపోవడమే ఆశ్చర్యం. ప్రాంతాల వారీగా కాకుండా.. పట్టణం, నగరం, మండలం వారీగా దరఖాస్తులు తీసుకోవడమే సమస్యకు కారణంగా కనిపిస్తోందని, గుంటూరులోని ఓ వైన్‌షాపు యజమాని చెప్పారు.

## రైతులకు రుణమాఫీ కాలేదు...

మొదటి పేజీ తరువాయి..

మారుస్తూ రుణమాఫీ తేదీలు మారుస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంత గ్రామంలోనూ, నియోజకవర్గంలోనూ కూడా రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. రుణమాఫీ విషయంలో నిబంధనలు, తేదీలు మారుతున్నప్పటికీ... ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో అబద్ధాలు, బూటకపు ప్రచారాలు మాత్రమే నిత్యం ఎలాంటి మార్పు లేకుండా కొనసాగుతున్నాయని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేం

మొదటి పేజీ తరువాయి..

ఐఎస్‌బీలో ఉన్న వారంతా తెలంగాణ, దేశానికి అంబాసిడర్లు. హైదరాబాద్‌ను 600 మిలియన్ సిటీగా మార్చేందుకు మీ అందరి సహకారం కావాలి. తెలంగాణను ఇతర రాష్ట్రాలతో పోల్చను. న్యూయార్క్,




లండన్, పారిస్‌తో పోల్చాలనుకుంటాను. మీరంతా తెలంగాణలో 2, 3 ఏళ్లు పనిచేయాలి. మా ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల తరహాలో మంచి జీతాలు ఇవ్వలేకపోవచ్చు. కానీ.. మంచి సవాళ్లు, జీవితానికి సరిపడా నాలెడ్జ్ అందిస్తుంది. దురదృష్టవశాత్తు ఒలింపిక్స్‌లో భారత్ స్వర్ణపతకాలు గెలవలేకపోయింది. అక్కడ అత్యధిక పతకాలు గెలవడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. వ్యాపారాల్లో రాణిస్తున్న వారు ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలి”అని రేవంత్ పిలుపునిచ్చారు.

## ఇంటర్ విద్యార్థిని మృతిపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం

మొదటి పేజీ తరువాయి..

సీఎం అన్నారు. ప్రత్యేక కోర్టులో ఫాస్ట్ ట్రాక్ విధానంలో ఈ కేసు విచారణ పూర్తి చేసి నిందితుడికి శిక్షపడేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఘటనలో నేరస్తుడికి మరణ శిక్ష స్థాయి శిక్ష పడేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. మహిళలు, ఆడబిడ్డలపై అఘాయిత్యాలు చేసేవారికి ఈ ఘటనలో పడే శిక్ష ఒక హెచ్చరికగా ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.







ప్రధాని మోదీ ప్రభుత్వం తెలంగాణలో కనెక్టివిటీ వేగవంతానికి అనేక చర్యలు తీసుకుందని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రైల్వేలకు జరిగిన నష్టాన్ని ప్రధాని నరేంద్ర మోదీ వేగవంతంగా పూడ్చే పనిలో ఉన్నారని తెలిపారు. ఇందులో భాగంగానే చర్లపల్లి, సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, యాదాద్రి మెట్రోలైన్, కొమురవెల్లికి ప్రత్యేక రైల్వే స్టేషన్ లాంటి అభివృద్ధి కార్యక్రమాలకు పచ్చజెండా ఊపారని కేంద్రమంత్రి ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం మంత్రి జి.కిషన్ రెడ్డి చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించి జరిగిన పనులపై అధికారులతో ఆరా తీశారు. స్టేషన్ మొత్తం కలియదిరిగి ఏ మేరకు పనులు జరిగాయి. ఇంకా ఏ మేరకు జరగాల్సి ఉంది అనే విషయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.







3

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 21, అక్టోబర్ 2024 ||

## 8 మంది గంజాయ్ విక్రేతల అరెస్టు

- సరుకు, వాహనాల స్వాధీనం
- డీఎస్పీ నాగేశ్వరరావు వెల్లడి



**నరసరావుపేట, మహానాడు:** పల్నాడు జిల్లా నరసరావుపేటలో గంజాయి విక్రయిస్తున్న ఎనిమిది మందిని అరెస్టు చేశామని డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక 1టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎనిమిది నిందితుల నుంచి ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, రూ.13 లక్షలు విలువ ఉన్న ఎనిమిది ద్విచక్రవాహనాలు, ఒక కారును అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

ఇదిలా వుండగా, దారి దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని, నిందితుల వద్ద నుండి మహిళ వద్ద అపహరించిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని నాగేశ్వరరావు తెలిపారు. విలేఖర్ల సమావేశంలో సీఐ విజయ్ చరణ్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఏపీఎస్‌పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ప్రారంభం



- 4 రోజుల పాటు వేడుకలు
- తొలిరోజు విజేతలు వెల్లడి
- ముగింపు ఉత్సవానికి హాజరుకానున్న హెూం మంత్రి అనిత



**గుంటూరు, మహానాడు:** ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఏపీఎస్‌పీఎఫ్) 33 ఆవిర్భావ దినోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆ సంస్థ అధినేత డీజీ డాక్టర్ త్రివిక్రమ వర్మ ఆధ్వర్యంలో ఐజి బి.వెంకటరామిరెడ్డి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆదివారం ఏపీఎస్‌పీఎఫ్ స్పోర్ట్స్ మీట్-2024ను ఘనంగా ప్రారంభించారు. ఈ వేడుకలు ఈ నెల 23వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు కొనసాగను న్నాయి. మొదటి మూడు రోజులు 202 మంది సిబ్బందికి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, 100 మీటర్లు, 400 మీటర్లు, 5,000 మీటర్ల పరుగు పందాలు నిర్వహిస్తారు.

చివరి రోజున ముగింపు కార్యక్రమంలో విజేతలకు రాష్ట్ర హెూం మంత్రి వంగలాపూడి అనిత, హెూం ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధర్ వార్ల చేతుల మీదగా బహుమతుల ప్రదాన కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా ఐజి వెంకటరామిరెడ్డి మాట్లా డుతూ, క్రీడలు సిబ్బందిలో స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేయడమే కాకుండా, వారి శారీరక, మానసిక ధృడత్వాన్ని పెంపొం దించడంలో ఎంతగానో సహాయపడతా యని అభిప్రాయపడ్డారు.

ఈ పోటీలు విజయాన్ని మాత్రమే కాకుండా, సమష్టిగా పనిచేయడం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి వంటి విలువలను పెంచే ప్రయత్నం అని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధినేత డాక్టర్ త్రివిక్రమ వర్మ, సిబ్బందిలో శారీరక, మానసిక ధృఢత్వం, క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో మరిన్ని క్రీడా కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో విజయవాడ జోన్ కమాండెంట్ ఎం. శంకర్రావు, అసిస్టెంట్ కమాండెంట్లు కె.కృష్ణ మూర్తి, బి.శ్రీనివాసరావు, పి.వి.ఎస్. ఎన్. మల్లికార్జున రావు, టి.కృష్ణమాచారి, కె.శ్రీనివాసులు, టి.కామేశ్వర రావు తది తరులు హాజరయ్యారు. అలాగే, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు కూడా పాల్గొన్నారు.

**తొలిరోజు విజేతల వివరాలు:**

**100 మీటర్ల పందెం:**

1వ స్థానం: M.S. చక్రవర్తి (పిసి 3452)
2వ స్థానం: R.రంజిత్ కుమార్ (పిసి 5716)
3వ స్థానం: ఏ.మహేష్ (పిసి 5872)

**400 మీటర్ల పందెం:**

1వ స్థానం: పి. పెంటయ్య (పిసి 3978)
2వ స్థానం: %వీ%. నారాయణ రావు (పిసి 5698)
3వ స్థానం: ఏ. మహేష్ (పిసి 5872).




## వైవిధ్య ఉత్పత్తుల్లో ప్రపంచ అగ్రగామి టాటా

- ఆర్థిక నిపుణుడు చెరుకూరి కుటుంబరావు

**గుంటూరు, మహానాడు:**

ప్రపంచవ్యాప్తంగా 100 దేశాలలో వైవిధ్యం గల వస్తు ఉత్పత్తి చేస్తూ 420 బిలియన్ డాలర్ల వార్షిక ఆదాయంతో ప్రపంచ గుర్తింపు పొందిన వ్యాపార దిగ్గజంగా టాటా గ్రూప్ రూపొందటం అభినందనీయ మని ప్రముఖ ఆర్థిక నిపుణుడు, ప్రణాళిక సంఘ పూర్వ ఉపాధ్యక్షుడు చెరుకూరి కుటుంబరావు పేర్కొన్నారు. స్థానిక జనచైతన్య వేదిక హాలులో ఆదివారం భారత్ ప్రగతిలో టాటాల పాత్ర అనే అంశంపై జరిగిన చర్చా గోష్టికి ముఖ్యఅతిథిగా హాజరై కుటుంబరావు ప్రసం గించారు.


భారతదేశంలో 1868లో ప్రారంభించిన టాటా గ్రూప్ దేశానికి ఆర్థిక పునాదులు వేసిందని, సంక్షేమం, ధాతృత్వాన్ని చాటి చెప్పారన్నారు.

సంపదను సృష్టిస్తూ వాటి ఫలితాలను సామాన్యులకు అందించే ధ్యేయంగా టాటా సంస్థలు పని చేస్తున్నాయన్నారు. 1912 లోనే ఎనిమిది గంటల పని విధానాన్ని, 1915లో ఉచిత వైద్య సహాయాన్ని, 1917లో కార్మిక సంక్షేమ విభాగాన్ని, కార్మికుల పిల్లలకు విద్యను అందించడం, 1920లో జీతంతో కూడిన సెలవులు ఇవ్వడం, 1920 లోనే కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ అమలు చేయడం, 1921లో నైపుణ్యాల అభివృద్ధి సంస్థ ఏర్పాటు, 1928లో ప్రసూతి సెలవులు ఇవ్వడం, 1934లో కార్మికులకు బోనస్, గ్రాట్యుటీ లాంటి సంక్షేమ కార్యక్రమాలను భారత దేశంలో మొదటిగా ప్రవేశపెట్టిన ఘనత టాటా గ్రూపులదే అన్నారు.

ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.ఏ.ఆర్. సుబ్రహ్మణ్యం, మానవత చైర్మన్ పావులూరి రమేష్, నేస్తం సహ వ్యవస్థాపకుడు టి.ధనుంజయ రెడ్డి తదితరులు ప్రసంగించారు. సభ ప్రారంభంలో రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు.

## గ్రూప్ 1 విద్యార్థులపై పోలీసుల దాడి అమానుషం!

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



**హైదరాబాద్, మహానాడు:**

గ్రూప్-1 విద్యార్థులపై పోలీసుల దాడి అమానుష మని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని దద్దమ్మల్లా పాలిస్తోంది.. పాలన చేతకాకపోతే రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో ఏమన్నారంటే.. కొండా, దానం, మేయర్ రౌడీల్లా వ్యవహరిస్తున్నారు. నన్ను చంపడానికి బెదిరిం పులు. అమిత్ షా కు ఫిర్యాదు చేశా.. నన్ను చంపాలని చూసినవాళ్ళు చనిపోయారే తప్ప, నన్ను ఏమీ చేయలేకపోయారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అంత అవినీతి ప్రాజెక్టు లేదని చెప్పిన రేవంత్ సీబీఐకి లెటర్ రాయడం లేదు. 10 నెలల్లో ఎందుకు చర్యలు తీసుకోలేదు? రైతులు, నిరుద్యోగులు, మహిళలు మంచోళ్ళు కాదు.. కానీ లక్షల కోట్లు దోచుకున్న వాళ్ళు రేవంత్‌కి మంచివాళ్ళలా కనిపిస్తున్నారు. నన్ను చంపితే నేను స్వర్గానికి పోతా. మంచి చేసేందుకు నేను సిద్ధం. పీఎస్ సమీట్ నిర్వహిద్దాం, 20 లక్షల కోట్ల అప్పు తీర్చుదాం. లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిద్దాం. మార్పు రావాలి అని భావించినోళ్లు నాకు మద్దతుగా నిలవాలి. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతుందుకే నన్ను చంపాలని బెదిరింపు కాల్స్ చేస్తున్నారు.

హైడ్రా డ్రామాల తయారైంది. నాగార్జున కు ఒక న్యాయం, రేవంత్ రెడ్డి తమ్ముడికి ఒక న్యాయమా? భూకబ్జా చేసినోళ్ళను పట్టుకోలేదు, అమ్మినోళ్ళను, అనుమతులు ఇచ్చినోళ్ళను వదిలేసి ఇండ్లు కొన్నవాళ్లకు మాత్రం అన్యాయం చేస్తున్నారు. మూసి పునర్జీవం అంటున్న రేవంత్ రెడ్డి లక్ష 50 వేల కోట్లు ఎక్కడినుంచి తెస్తారు? 7 లక్షల కోట్లు కేసీఆర్ అప్పు చేస్తే, రేవంత్ కూడా అదే దారిలో నడుస్తున్నారు.

## క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందించాలి

- మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం, మహానాడు:**

క్షేత్రస్థాయిలో ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు కృషి చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం నగరంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ అడ్మిన్ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైందని, పింఛన్ల పంపిణీ సజావుగా సాగేందుకు వారు ఎంతో కృషి చేస్తున్నారని మంత్రి అభినందించారు. సచివాలయానికి అడ్మిన్ నాయకుడు లాంటివాడని, సచివాలయంలోని మిగిలిన సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ బందరు అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని సూచించారు.

బందరును ఒక ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడానికి నా బంగారు బందరు కార్యక్రమంతో శ్రీకారం చుట్టామని, నగరంలోని ప్రతి డివిజన్ ను స్వచ్ఛ డివిజన్ గా తయారు చేయడానికి ప్రణాళిక బద్ధంగా పనిచేస్తున్నామని, ఆ దిశగా సచివాలయ ఉద్యోగులు పనిచేస్తూ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రతి సచివాలయ ఉద్యోగి వారి పరిధిలోని సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని, అందుకు ప్రతిరోజు వారు క్షేత్రస్థాయిలో సందర్శించి ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, అంగన్వాడీ, మున్సిపాలిటీ పాఠశాలలకు మరమ్మతులు చేపట్టడానికి అవసరమైన నిధులను సమకూరుస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, దానిని సద్వినియోగం చేసుకునే విధంగా పట్టభద్రులకు ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.

ఈ సమావేశంలో నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్పర్సన్ గొర్రెపాటి గోపీచంద్, కూటమి నాయకులు బండి రామకృష్ణ, ఇలియాజ్ బాషా, పల్లపాటి సుబ్రహ్మణ్యం, తలారి సోమశేఖర్, పలువురు కార్పొరేటర్లు, సచివాలయ అడ్మిన్లు తదితరులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వంలో అడిగిన వెంటనే ఆర్థిక సాయం

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

**చిలకలూరిపేట, మహానాడు:**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన గడిచిన నాలుగు నెలలుగా ఆపదలో, అవసరంలో ఉన్న వారు అడిగి వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆపన్నహస్తం లభిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఎమ్మెల్యేను కలవాలి అంటేనే నెలలు తరబడి తిరగాల్సిన పని లేదని, అయినా సాయం అందుతుందో లేదో అన్న ఆందోళనతో నిరీక్షించాల్సిన పరిస్థితులు ఇప్పుడు లేవన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అడిగి వారికి లేదనుకుండా సాయం చేస్తున్న సీఎం చంద్రబాబుకు ఎంతో మంది చిన్నారులు, విధివంచితులకు ప్రాణదాతగా నిలుస్తున్నారన్నారు.

నియోజకవర్గానికి చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు రూ.6.91 లక్షల విలువైన ముఖ్యమంత్రి ఆర్థిక సహాయనిధి చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే అందజేశారు.

గ్రంధి లక్ష్మీపార్వతికి రూ.51,310, బొందిలి నాగప్రసన్నబాయికి రూ.40,600, గణపవరానికి చెందిన కోమటినేని పావనికి రూ.1.50 లక్షలు, లింగంగుంట్లకు చెందిన మద్దుకూరి రమాదేవికి రూ.95,601, గజ్జల శివకుమార్‌కు రూ.25 వేలు, కావూరుకు చెందిన నాయుడు శ్రీనివాసరావుకు రూ.75 వేలు, అప్పాపురానికి చెందిన ఆరేటినాగేశ్వర రావుకు రూ.1,51,333, దింతెనపాడుకు చెందిన అత్తోట రామారావుకు రూ.1,02,619 విలువైన చెక్కులను అందజేశారు.

## వారెవరో నాకు తెలియదు

- తిరుమల టికెట్ల సంఘటనపై ఎమ్మెల్సీ జఖియా ఖానం స్పందన



**రాయచోటి, మహానాడు:**


కృష్ణ తేజ అనే పీఆర్వో ఎవరో కూడా నాకు తెలియదు... బెంగళూరుకు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి కూడా నాకు తెలియదు.. శశికుమార్ ఎవరో కూడా నాకు తెలియదు.. లెటర్లు అడిగిన సన్నిహితులకు ఇస్తూ వచ్చామని ఎమ్మెల్సీ జఖియా ఖానం తెలిపారు. ఈ మేరకు ఆమె మీడియాతో ఏమన్నారంటే... తిరుమల దేవస్థానానికి సంబంధించిన ఇష్యూ ఆదివారం ఉదయమే నాకు తెలిసింది.. ఇందులో వాస్తవం లేదు.. నాకు పీఆర్వోలు ఎవరూ లేరు. ముందు ఉన్న పీఆర్వో గతంలో భక్తులకు రెస్పాండ్ కావడం లేదని అతనిని తీసేసాం.. తర్వాత నా పీఏ నే అన్ని చూసుకుంటున్నాడు.. ఈ నాలుగేళ్లలో నేను ఎటువంటి లిమిట్స్ క్రాస్ చేయలేదు.. చట్టపరంగానే వ్యహరిస్తున్నాను.. నా స్నేహితులకు మాత్రమే లెటర్స్ ఇస్తూ వచ్చాను.. ఇన్నేళ్ళలో ఎప్పుడూ ఇలాంటి సంఘటన జరగలేదు.. దీని వెనక ఏదో రాజకీయ కోణం ఉన్నట్లు అనిపిస్తుంది..

ఒక మైనారిటీ మహిళ ఉన్నత స్థానంలో ఉందని చెప్పి నా పట్ల ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారు.. మా కుటుంబానికి మంచి రాజకీయ నేపథ్యం ఉంది. కులమతాలకు అతీతంగా మేం సర్వీస్ చేశాం.. నేను ఉన్నత పదవిలో ఉన్నానని ఏ రోజు ప్రోటోకాల్ ను అధిగమించలేదు.. పదవుల ఏమి శాశ్వతం కావు.. ఈ నాలుగేళ్ళలో నాపై ఒక్క చెడ్డ మరక కూడా లేదు.. నన్ను ఇబ్బంది పెట్టిన వారిని కూడా నేనెప్పుడూ ఇబ్బంది పెట్టలేదు.. ప్రస్తుతం చిన్న క్యాడర్లో ఉన్న వ్యక్తులు కూడా చెలరేగిపోతున్నారు.. నేను అబద్ధాలు చెప్పను .. ఇక్కడ చిన్న పిల్లాడిని అడిగినా మా కుటుంబం సంగతి చెబుతారు.. ముఖ్యమంత్రులే అవసరాన్ని బట్టి పార్టీలు మారతారు.. పార్టీ మారడం అనేది తప్పుకాదు.. సామాజికాల పరంగా పార్టీలకు అవసరాలు ఉంటాయి.. దానిని బట్టి నడుచుకోవాలి.. ఏ పార్టీలో ఉన్నా లాయల్‌గా నడుచుకునే కుటుంబం మాది.. ఇలా ఎందుకు జరిగిందో అర్థం కావడం లేదు ఇలా ఎప్పుడూ అలా బిహేవ్ చేయలేదు..

జనం గుండె చప్పుడు
# మహానాడు
4
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 21, అక్టోబర్ 2024 ||




సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం పెనుకొండ మండలం శెట్టిపల్లి పంచాయతీ బాపనకాలువ గ్రామములో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 30 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన సీసి రోడ్డును ప్రారభించిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌలి శాఖ మంత్రివర్యులు శ్రీమతి సవితమ్మ అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు..



## చార్‌ధామ్ యాత్ర ముగింపు తేదీలివే!

**ఉత్తరాఖండ్:** దేవభూమి ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్ర కొనసాగుతోంది. తాజాగా ఉత్తరాఖండ్ ప్రభుత్వం నాలుగు ధామ్‌ల మూసివేత తేదీలను ప్రకటించింది. ఉత్తరాఖండ్ టూరిజం మంత్రి సత్పాల్ మహరాజ్ ఆ వివరాలు వెల్లడించారు. నవంబర్ ఒకటిన గంగోత్రి ధామ్ తలుపులు మూసేస్తామని, యమునోత్రి ధామ్, కేదార్‌నాథ్ ధామ్ తలుపులు నవంబర్ మూడోతేదీన మూసివేస్తామని వెల్లడించారు. అలాగే నవంబర్ నాలుగోతేదీన తుంగనాథ్ ధామ్ తలుపులు, నవంబర్ 17న బద్రీనాథ్ ధామ్ తలుపులు మూసివేయనున్నామని తెలిపారు. భక్తులు ఈ విషయాలను గమనించాలని ఆయన కోరారు.



రాప్తాడు నియోజకవర్గం, రామగిరి మండలం, కుంటిమద్ది చెరువు మరువ వద్ద ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదివారం చీర, సారెను గంగమ్మకు సమర్పించి, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ పరిటాల రవీంద్ర, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ మరువ వద్ద హంద్రీ – నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు నిత్యం పరవళ్ళు తొక్కుతుంటాయి.

## టీడీపీ మైనారిటీ నేత షేక్ కరిముల్లా మృతికి సీఎం సంతాపం

**అమరావతి, మహానాడు:**




తెలుగుదేశం పార్టీ(టీడీపీ) మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన షేక్ కరిముల్లా మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే కరిముల్లా మృతి బాధాకరం అని అన్నారు. కింది స్థాయి నుండి రాష్ట్ర నేతగా కరిముల్లా ఎదిగారన్నారు. కరిముల్లా కుటుంబ సభ్యులకు సీఎం సానుభూతిని తెలిపారు.

# గ్రూప్-1 పరీక్షపై బీజేపీ, బీఆర్ఎస్‌లు కుమ్మక్కు!

### టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, మహానాడు:**




గ్రూప్ 1 పరీక్షపై.. బీజేపీ, బీఆర్ఎస్ లు కుమ్మక్కై లేనిపోని అనుమానాలు సృష్టిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఇక్కడి గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఏమన్నారంటే.. విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారు. బీసీ బిడ్డగా.. నేను మీకు మాట.. భరోసా ఇస్తున్న. సెలక్షన్ ప్రక్రియలో ఎక్కడా.. రిజర్వుడు కేటగిరీకి అన్యాయం జరగదు. ఇది.. మా పార్టీ ప్రభుత్వం నుండి ఇస్తున్న భరోసా. జీఓ 29 తో నష్టం అనేది అపోహ మాత్రమే. బీజేపీ ఏ మొఖం పెట్టుకుని ధర్నాలు చేస్తోంది. బీఆర్ఎస్ నియామకాల పేరుతో నే అధికారం లోకి వచ్చింది. పదేళ్లలో టీఎస్‌పీఎస్‌సీ నుండి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు చెప్పండి! పదేళ్లలో పట్టుమని.. 35 వేల ఉద్యోగాలు నోటిఫికేషన్ ద్వారా ఇచ్చారు.

ఇంటర్ మీడియట్ ఫలితాలు చక్కగా ఇవ్వలేని మీరు మా గురించి మాట్లాడుతున్నారు. బండి సంజయ్.. మీ హయంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు. మీరు నిరుద్యోగుల గురించి మాట్లాడు తున్నారు. 10 యేండ్ల లో 70 వేల ఉద్యోగాలు ఇచ్చిన బీఆర్ఎస్ కు చిత్తశుద్ధి ఉందా? పది నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చిన కాంగ్రెస్ కి కమిట్ మెంట్ ఉందా..? బీఆర్ఎస్ ఒక్క గ్రూప్ 1 ఉద్యోగం అయినా ఇచ్చిందా.? ఇన్నాళ్లు ఉద్యోగాలు ఇవ్వని మీరు ఇప్పుడు ధర్నా చేస్తున్నారు.




## అధ్వాన్నపు రహదారి బాగుకు కార్పొరేటర్ హామీ

**విశాఖపట్నం, మహానాడు:** ఆ దారిలో ప్రయాణమంటే పరిసర ప్రాంతీయులకు నరక ప్రాయమే. నిత్యం పాదచారులు, వాహనదారులతో సందడిగా ఉండే ఆ రహదారి ప్రస్తుతం రాళ్లు పైకి తేలి, గుంతలమయం కావడంతో దైనందిన కార్యక్రమాలతో ఉరుకులు పరుగులు తీసే నివాసితులకు కంటిమీద కునుకు కరువైంది. 95వ వార్డు పరిధిలోని పురుషోత్తపురం, హెచ్ బి కాలనీ ప్రాంతవాసులు తమ దుస్థితిని వివరిస్తూ స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేవుడుకు విన్నవించుకున్నారు.

ఈ మేరకు కార్పొరేటర్ ఆదివారం ఉదయం ఈ ప్రాంతాన్ని సందర్శించి, పరిస్థితిని గమనించారు.

ఆయన వెంట కంఫర్ట్ హోమ్స్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.రామకృష్ణ, ఎం.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి హెచ్ జోగారావు, ఇతర ప్రతినిధులు టి.మాధవ్, ఏ.కేశవరావు, గణేష్, మురళి, హెచ్‌బి కాలనీ ప్రతి నిధులు రమణమూర్తి, సతీష్, సత్యనారాయణ కదలి వచ్చారు. కార్పొరేటర్ దేముడు తన స్పందన వ్యక్తం చేస్తూ.... ముందుగా గోతుల్ని కప్పి సాంత్వన కలిగిస్తానని, తదుపరి అంచనా వేయించి పక్క తారు రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



### తాడేపల్లి ఎసీసీ కిస్నా సిమెంట్ ఫ్యాక్టరీ
## కార్మిక కుటుంబాలను ఆదుకోండి

- మంత్రి నారా లోకేష్‌కి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ లేఖ

**విజయవాడ, మహానాడు:** మీరు మంగళగిరి నియోజకవర్గానికి శాసన సభ్యుడిగా ఉంటూ రోజు మీ వద్దకు వచ్చే అనేక మంది బాధలను వింటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నందులకు ముందుగా అభినందనలు. గుంటూరు జిల్లా తాడేపల్లి కిస్నా ఫ్యాక్టరీ యాజమాన్యం అక్రమంగా లాకౌట్ ప్రకటించి ఇప్పటికి 32 సంవత్సరాలు అవుతున్నది. సెంట్రల్ లేబర్ ట్రిబ్యునల్ కోర్టు, హైకోర్టు వారు వీరికి చెందిన భూములను వేలం వేసి కార్మికులకు 43 కోట్లు చెల్లించమని ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఇప్పటి వరకు ఈ పక్రియ కొనసాగలేదు. మొత్తం 333 మంది కార్మికులకు ఇప్పటికే 160 మందికి పైగా కార్మికులు ఆనారోగ్యంతో, ఆర్థాకలితో మృతి చెందారు. కార్మికులు వివిధ రూపాలలో ఆందోళనలు చేపట్టినా ఇప్పటి వరకు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. కిస్నా ఫ్యాక్టరీ యాజమాన్యం వారికి మంగళగిరిలోని ఎయిమ్స్ అనుకొని 137 ఎకరాలకు పైగా విలువైన ఆస్తులు ఉన్నాయి. వీటి విలువ కనీసం 1400 కోట్ల రూపాయలకు పైగాఉంటుంది. వెంటనే ఈ ఆస్తులను అమ్మి ఆనారోగ్యం,ఆర్థాకలితో బాధపడు తున్న కార్మికుల బకాయిలు చెల్లించి బాధితులకు న్యాయం చేయ్యవలసిందిగా కోరుతున్నానని రామకృష్ణ తన లేఖలో పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ జకియా ఖానం వైఎస్సార్‌సీపీలో లేరు

- శాసన మండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ


**తాడేపల్లి, మహానాడు:** తిరుమలలో వీఐపీ దర్శన టికెట్లు బ్లాక్‌లో అమ్ముకున్నట్టు ఫిర్యాదు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ జకియా ఖానంతో వైయస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధం లేదని శాసన మండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యన్నారాయణ వెల్లడించారు. ఈ విషయాన్ని అనవసరంగా వైయస్సార్‌సీపీకి అంటగట్టేందుకు కొందరు తప్పుడు ప్రచారం



చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్సీ జకియా ఖానం ఇప్పుడు వైయస్సార్‌సీపీలో లేరని, సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆమె తెలుగు దేశం పార్టీలోకి వెళ్ళిందన్నారు. అంతేకాక పలు సందర్భాలలో మంత్రి లోకేష్‌తో భేటీ అయిన విషయాన్ని బొత్స గుర్తుచేశారు.

## కాపు సంఘ ప్రమాణ స్వీకారమహొత్సవం


**నరసరావుపేట, మహానాడు:** నరసరావుపేట జామిందర్ ఫంక్షన్ హల్ లో నరసరావుపేట నియోజకవర్గ శ్రీ కృష్ణదేవరాయలు కాపు సంఘం ప్రమాణ స్వీకార మహొత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, సతీమణితో



కలిసి పాల్గొన్నారు. ముందుగా వంగవీటి మోహన రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం కమిటీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో కాపులు మరింత అభివృద్ధి చెందాలని దానికి అందరు కలిసి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కేరళ 'శ్రీ పద్మనాభ స్వామి' ఆలయంలో చోరీ

**కేరళ:** కేరళలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో చోరీ జరిగింది. స్వామివారి పూజకు వినియోగించే 'ఉరులి' అనే కంచు పాత్రను దుండగులు దొంగిలించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా హరియాణాలో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు కేరళ పోలీసులు తెలిపారు. వారిలో ఒకరు ఆస్ట్రేలియా పౌరసత్వం కలిగిన వైద్యుడని వెల్లడించారు. ఇతర నిందితులతో కలిసి గత వారం క్షేత్రాన్ని సందర్శించిన అనంతరం చోరీకి పాల్పడ్డాడని పేర్కొన్నారు.







# పల్లెలే దేశానికి పట్టు కొమ్మలు!



- గ్రామాల అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- సీఎం బాబుతోనే గ్రామాలకు పూర్వ వైభవం
- మంత్రి సవిత

**మరువపల్లి, మహానాడు:** ఉపాధి హామీ పథకం రాష్ట్రాలకు జీవం పోషిందని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ అన్నారు. సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజక వర్గం పెనుకొండ మండలం రాంపురం పంచాయతీ మరువపల్లి గ్రామంలో 86 లక్షల నిధులతో ఆదివానం పలు అభివృద్ధి పనులకు మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పాలనతో పల్లెలకు పూర్వ వైభవం తెచ్చేందుకే పల్లె పండుగ పేరుతో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి దఫా పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు.

త్వరలోనే రెండో దఫా నిధులను కేటాయించి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు.

రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి భారతదేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటినుండే ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు.

గత ప్రభుత్వం తప్పిదలవల్ల రాష్ట్రం పూర్తిగా అభివృద్ధికి నోచుకోలేక అన్ని రంగాలను నిర్వీర్యం అయ్యాయని మంత్రి విమర్శించారు. గ్రామ పంచాయతీలలో సర్పంచులకు అధికారం లేకుండా చేయడమే కాకుండా కుంటుపడిన అభివృద్ధికి వారిని బాధ్యులను చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామనికి సర్పంచ్లకు పూర్తిగా అధికారమిచ్చి సర్పంచుల గౌరవం ఇచ్చిందన్నారు.

డిజిటల్ న్యూస్ పేపర్

సోమవారం 21, అక్టోబర్ 2024

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com


డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 2,03,132

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1న ప్రారంభమైన మన

మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న

మా అభిమాన పాఠకుల

అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్

మార్తి సుబ్రమణ్యం

సంపాదక సారధ్యంలో





బోడెపూడి సుబ్బారావు (BSR)

సారధ్యంలో

